క్లుప్తంగా

కల్యాణ వైభోగమే..!



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పూజారి

ఏర్పేడు: మండలంలోని పాత వీరాపురంలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి స్వామి అమ్మవారికి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ పూజారి రవి శాస్త్రోక్తంగా కల్యాణం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, ఆలయ చైర్మన్ మాధవరెడ్డి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గురవారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మునిరంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మునిరత్నంరెడ్డి, కోదండ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపురమ్మ ఆలయానికి విరాళం



నగదును అందజేస్తున్న కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని పాయిల్‌సెంటర్‌లో కొల్లాపురమ్మ ఆలయానికి బుధవారం మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి రూ.10 వేలను అందజేశారు. జూన్ 3, 4న ఇక్కడ జాతర నిర్వహించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదేశంతో కిశోర్‌రెడ్డి ఈ విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అంజూరు, విశ్రాంత అధికారి శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ పురాతన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణానికి దాత, విశ్రాంత ఎస్‌బీఐ అధికారి శ్రీనివాసులు ముందుకు రావడం సంతోషకరమన్నారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేస్తామన్నారు. గతంలో ఈయన నిత్యాన్నదాన పథకానికి రూ.5లక్షలు ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, బాలాజి, వేదపండితులు అర్ధగిరిస్వామి పాల్గొన్నారు.

నిరక్షరాస్యతను నిర్మూలిస్తే అభివృద్ధి



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

నారాయణవనం: గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యత, పేదరికాన్ని పారదోలడమే తమ సంస్థ లక్ష్యమని 'నైస్' కార్యదర్శి పూర్ణచంద్రరావు అన్నారు. మండలంలోని పాలమంగళం ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన నైస్ సంస్థ నెల పాటు వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహించింది. బుధవారం ముగింపు సమావేశంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రాతినిధ్య సర్టిఫికెట్లను అందజేశారు. పూర్ణచంద్రరాజు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో నిరక్షరాస్యతను నిర్మూలిస్తే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రధానంగా తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపకుండా చదివించాలని కోరారు. నెల పాటు చేతి రాత, సంగీతం, కరాటే, యోగ, నృతం, ధ్యానం, స్పోకెన్ ఇంగ్లిష్‌లో శిక్షణ ఇచ్చారు. పిల్లలు గణితం, సామాన్య శాస్త్రం అంశాలను సులువుగా నేర్చుకోవడానికి వీలుగా బటర్ ఫ్లై సంస్థకు చెందిన రూ 60 వేల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు పాఠశాలకు నైస్ సంస్థ అందజేసింది. అలాగే పాఠశాల పూర్వ విద్యార్థి రామచంద్రుడు రూ 15 వేల క్రీడాసామగ్రిని అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వైభవంగా గంగ జాతర

శ్రీరంగరాజపురం: అశేష జనవాహిని మధ్య గంగ జాతరను గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని మత్రిపల్లి, జీఎంఆర్ పురం గ్రామాల్లో గంగమ్మ జాతర సందర్భంగా ఆటపాటలతో మంగళతోరణాల మధ్య ఉత్సవ మూర్తి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదారులుగా గుణశేఖర్ నాయుడు వ్యవహరించారు. గ్రామపెద్దలు తిరుమల, మునికృష్ణ పాల్గొన్నారు.

సేవా ఆణిముత్యాలు వలంటీర్లు

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: వలంటీర్లు ప్రజలకు సేవ చేయడంలో ఆణిముత్యాలు అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కొనియాడారు. బుధవారం ఉదయం నాగలాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వలంటీర్లను సన్మానించారు. ఇద్దరికి సేవావజ్ర, ఐదుగురికి సేవారత్న, 167 మంది వలంటీర్లకు సేవామిత్ర అవార్డులు అందజేసి శాలువ, ప్రశంసా పత్రాలతో వారిని సత్కరించారు. ఆయన మాట్లాడుతూ, వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ పాలన మరింత చేరువైందన్నారు. ప్రధానంగా పింఛన్లు పంపిణీ చేయడంలో వలంటీర్లు తమ సత్తా చాటుతున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా ప్రజలకు చేరడానికి ఈ వ్యవస్థ మరింత దోహదపడుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ, ఎంపీపీ సింధు తదితరులు మాట్లాడారు. వైస్ ఎంపీపీ కుమారి, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎస్ఐ హనుమంతప్ప, సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు పళణి, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, సర్పంచులు హేమావతి, మదన్ రెడ్డి, మునివేలు, క్రిష్ణయ్య, భాస్కర్, ఏలుమలై, మహేంద్రన్, వడివేలు, ఎంపీటీసీ సభ్యులు రవి, రాజ, చిత్ర, కావేరి ఏఎంసీ డైరెక్టర్లు షాబుద్దీన్, కులశేఖర్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్ఎం సురేష్, నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, డానియేల్, ఉదయ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నాగలాపురంలో సేవా పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



హాజరైన వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు,



కుంభాభిషేక పూజల్లో ఎమ్మెల్యే ఆదిమూలం

కుంభాభిషేక పూజల్లో ఎమ్మెల్యే

నాగలాపురం మండలం వజ్జావారి కండ్రిగలో నూతనంగా నిర్మించిన రాధ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ కుంభాభిషేక పూజల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఆయనకు ఆలయ నిర్మాణకర్తలు జ్యోతి రెడ్డి, దశరథ రెడ్డి, జనార్దన్, గజేంద్ర రెడ్డి, పరంధామ రెడ్డి, భాస్కర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన స్వామి, అమ్మవార్లకు ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థ, ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో గుజరాత్ ఎంపీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని బుధవారం గుజరాత్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, నవశారి ఎంపీ సీఆర్ పాటిల్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.



ఎంపీ పాటిల్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శరవేగంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు



కోబాకలో విద్యుత్ స్తంభం ఏర్పాటు

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో ఎస్పీడీసీఎల్ ఏఈ వాసుదేవయ్య ఆధ్వర్యంలో బుధవారం శరవేగంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులు చేశారు.. మంగళవారం సాయంత్రం గాలీవాన ధాటికి మేర్లపాక, కోబాక, దుర్గిపేరి, నచ్చనేరి, కృష్ణంపల్లె తదితర గ్రామాల పొలాల్లో 10 విద్యుత్ స్తంభాలు, మూడు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరగడం విదితమే. బుధవారం ఉదయం నుంచి ఎస్పీడీసీఎల్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన పనులు చేశారు.

భక్తిప్రపత్తులతో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



లింగమనాయుడుపల్లెలో అంకాలమ్మ ఆలయం వద్ద పవిత్రారెడ్డి, నాయకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం రాంబట్లపల్లెలో బుధవారం సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి, సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఆమెకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మహదేవరెడ్డి, మణి, సుధాకర్‌నాయుడు, మోహన్, చెంచురామిరెడ్డి, పావయ్య పాల్గొన్నారు. అలాగే లింగమనాయుడుపల్లెలో నూతనంగా నిర్మించిన అంకాలమ్మకు కుంభాభిషేక కార్యక్రమంలో కూడా ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు నాయుడు, జి.వి.నాయుడు,శ్రీను, రమేష్, సురేష్ పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ



జైలు పరిసరాలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి కృష్ణప్రియ

శ్రీకాళహస్తి: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని సబ్‌జైలును బుధవారం శ్రీకాళహస్తిన్యాయస్థాన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియ ఆకస్మిక తనిఖీ చేశారు. సబ్ జైలు పరిసరాలు, వసతి గదులు, స్టాక్ రూమ్, భోజనశాల పరిశుభ్రతను పరిశీలించారు. ఖైదీలకు పెట్టే భోజనం, ఆరోగ్య సమస్యలపై ఆరా తీశారు. న్యాయపరమైన సమస్యలు, మరేవైనా ఇతర సమస్యలు ఉంటే అర్జీ రూపంలో తెలియజేయాలని ఖైదీలకు సూచించారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

- ఆరులేన్ల మార్గంలో మరిన్ని కల్వర్టులు నిర్మించాలి
- మండల సమావేశంలో ఎంపీపీ, సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ

పిచ్చాటూరు: ప్రజా సమస్యలపై అధికారులు వేగంగా స్పందించి పరిష్కరించాలని ఎంపీపీ హెచ్ రేఖ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. వేసవికాలం కావడంతో గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఇళ్ల పట్టాల లబ్ధిదారుల జాబితతో పాటు శ్మశానాలు ఎక్కడెక్కడ ఉన్నాయో వివరాలు తెలియజేయాలని తహసీల్దారు మధుసూదన్‌రావును సింగిల్‌విండో చైర్మన్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి కోరారు. అలాగే శ్మశానాలకు దారి సమస్య, ఇతర సమస్యలను పరిష్కరించాలన్నారు. రైతు భరోసా, సబ్సిడీ పథకాలకు, పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని మండల వ్యవసాయ అధికారి సంజీవ రెడ్డి తెలిపారు. మండలం మీదుగా వెళ్లే ఆరులేన్ల మార్గంలో మరిన్ని కల్వర్టులు నిర్మించాలని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. వివరాలు ఇస్తే హైవే అధికారులకు దృష్టికి తీసుకెళ్లి, కల్వర్టుల నిర్మాణానిక తమవంతు కృషి చేస్తామని ఇరిగేషన్ ఏఈ శివబాల తెలిపారు. పంచాయతీ రాజ్ పనులకు సంబంధించి గత ఏడాదికి సంబంధించిన రూ.80 లక్షలు జమ అయ్యాయని పీఆర్ ఏఈ మణిబాబు తెలిపారు. ఇప్పటికి 70 శాతం బిల్లులు కాంట్రాక్టర్ల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. ప్రారంభమైన సచివాలయాలు, ఆర్‌బీకేలు, ఇతర ప్రభుత్వ భవనాలలో చిన్న, చిన్న పనులను పూర్తి చేసి ఆయా శాఖలకు కేటాయించాలని ఆయన కోరారు. వైద్యాధికారి డాక్టర్ హమీద్ మాట్లాడారు. సమావేశంలో వైస్ ఎంపీపీ విజయ, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా నటశేఖర కృష్ణ జయంతి



నివాళులు అర్పిస్తున్న కృష్ణ అభిమానులు

శ్రీకాళహస్తి: సూపర్‌స్టార్ నటశేఖర కృష్ణ జన్మదిన వేడుకలను శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని దేవి ప్రెస్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిత్రసీమకు ఆయన చేసిన సేవలను స్మరించారు. కార్యక్రమంలో అభిమానులు బీవీ శేఖర్, మురుగ, ధన, మీర్జావలి, జానీబాషా, గణేష్, శీనా స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద శేషవాహనంపై కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారు పెద్ద శేష వాహనంపై పరమపద నాధునిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేకువజామున 3 గంటలకు ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలు పూర్తి చేశారు. ఆలయ మాడవీధుల్లో ఉత్సవ మూర్తుల ఊరేగింపు అనంతరం ఆలయంలో ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య గరుడాళ్వార్ చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అర్చకులు అధిరోహింపచేయడంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్థానిక వీరరాఘవ దేవస్థానం నుంచి పట్టుసాలీలు ఊరేగింపుగా ఆలయానికి వచ్చి స్వామి వారికి పట్టువస్త్రాలను సమర్పించారు. 11 గంటలకు ఉత్సవమూర్తులకు ఆగమోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించి దీప ధూప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం 5.30 గంటలకు స్వామి వారు ఉభయ నాంచారులతో పరమపద నాధునిగా ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు పెద్ద శేష వాహనంపై విశేష అలంకరణతో అధిష్ఠించి విహరించారు. వెస్ట్ గోదావరి జిల్లా తణుకుకు చెందిన సుబ్రమణ్యేశ్వర నాట్య మండలి సభ్యుల కోలాటాలు, నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ అధికారి నాగరాజు, భద్రతా జమేదార్ విజయకుమార్, భరత్ తదితరులు పర్యవేక్షించారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు



పెద్దశేష వాహనంపై ఉభయ నాంచారులతో కల్యాణ వెంకన్న



నృత్యం చేస్తున్న బాలలు

జగనన్న మేనిఫెస్టోను కాపీ కొట్టిన చంద్రబాబు



ఇంటికి అందుతున్న సంక్షేమ పథకాల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి విమర్శ

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నెరవేర్చిన మేనిఫెస్టోలోని హామీలను తెలుగుదేశం అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు కాపీ కొట్టి టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించడం విడ్డూరంగా ఉందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అపహాస్యం చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చని నైజం చంద్రబాబుదైతే, ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలకు కూడా నెరవేర్చిన ఘన చరిత్ర తమ జగనన్నదని అన్నారు. అందుకే ఇతర రాష్ట్రాలు సైతం మన పథకాలపై ఆసక్తి చూపుతున్నాయన్నారు. బుధవారం సాయంత్రం శ్రీకాళహస్తి మండలం చల్లపాళెం బీసీ కాలనీ, చల్లపాళెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పింఛను అందుతోందా, లేదా? ఏమైనా సమస్యలున్నాయా? అని ఆరా తీశారు. లబ్ధిదారులు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్‌తో వివరించారు. అనంతరం ఆయన పైవిధంగా మాట్లాడారు. చంద్రబాబు తమ మేనిఫెస్టోను కాపీ కొట్టి మాట్లాడినా ప్రజలు ఆయన్ను నమ్మే పరిస్థితి లేదన్నారు. ఆయనకు మళ్లీ బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. తమ కుటుంబం యావత్తూ నియోజకవర్గంలో పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేస్తోందన్నారు. సమస్యలు ఉంటే ఇక్కడే కాకుండా పార్టీ కార్యాలయంలోనూ తెలియజేయవచ్చన్నారు. రద్దు చేసిన పింఛన్లను పునరుద్ధరించాలని, రోడ్లు వేయించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాపి రెడ్డి వెంకట సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ జయరాం రెడ్డి, ఎంపీటీసీ హరి, మునిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మహేష్, సురేష్, ప్రభాష్, చెంచయ్య, వెంకటరెడ్డి, రజనీకాంత్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపరాదు

బుచ్చినాయుడుకండ్రిగ: ఎస్సీ, ఎస్టీలపై ఇతర కులాల వారు వివక్ష చూపరాదని, అలా చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని తహసీల్దారు హనుమాన్‌నాయక్ హెచ్చరించారు. బుధవారం మండలంలో కంచనపుత్తూరు గ్రామ పంచాయతీలోని ఎస్టీ కాలనీలో సామాజిక న్యాయంపై రెవెన్యూ, పంచాయతీ రాజ్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా గిరిజనులకు అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం కల్పిస్తున్న హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వివక్షకు గురైయితే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బలక్ష్మి, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎస్ఐ మంజునాథరెడ్డి, ఆర్ఐ వెంకట సుబ్బయ్య, సర్పంచ్ స్వప్న, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, వీఆర్ఓ వెంకటేశ్వర్లు, పోలీస్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరి సచివాలయంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంఎన్ కంటి ఆసుపత్రి ఆరంజ్ మిషన్ వైద్య బృందం 72 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించింది. 15 మందికి కంటి అద్దాలు, 14 మందికి ఆపరేషన్‌కు రెఫర్ చేసినట్లు సంస్థ నిర్వాహకులు నవీన్ తెలిపారు. శిబిరంలో పుత్తూరు సీఐ సురేష్ కుమార్, స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి హాజరై కంటి పరీక్షలు చేసుకున్నారు. ఏర్పాట్లను సచివాలయ కన్వీనర్ మునిచంద్ర శేఖర్ పర్యవేక్షించారు. శిబిరంలో కంటి వైద్యులు డాక్టర్ కీర్తన, చారి, ఆరంజ్ మిషన్ సిబ్బంది పాల్గొన్నారు.



ఉచిత కంటి పరీక్షలు చేసుకుంటున్న సీఐ

స్త్రీనిధి రికవరీ వంద శాతం ఉండాలి

సత్యవేడు: స్త్రీనిధి చెల్లింపులు వంద శాతం ఉండేలా వీఏఓలు చర్యలు తీసుకోవాలని స్త్రీనిధి ఏజీఎం వి.హేమంత్‌కుమార్, ఏరియా కో-ఆర్డినేటర్ డాక్టర్ డాంగే యాదవ్ ఆదేశించారు. బుధవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వీఏఓలతో వారు సమీక్షించారు. సంఘాల బ్యాంకు లావాదేవీలు, స్త్రీనిధి, ఉన్నతి-ఎస్సీ, ఎస్టీ లోన్లు వివరాలపై సమీక్షించారు. గ్రామసంఘాల మహిళలకు మేలు కలిగేలా వీఏఓలు పనిచేయాలన్నారు. మొబైల్ బుక్ కీపింగ్, గ్రేడింగ్ సక్రమంగా చేయాలని, సంఘాల సమావేశాలకు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. 2023-24 సంవత్సరానికి రూ. 5కోట్ల లక్ష్యం నిర్దేశించినట్లు చెప్పారు. ఆసరా బయోమెట్రిక్‌లో సత్యవేడు సంఘాలు జిల్లాలో చివరి స్థానంలో ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. స్త్రీనిధి మేనేజర్లు వనజ, మోహన్ రెడ్డి, లీగల్ అడ్వైజర్ బి.లక్ష్మయ్య, ఏపీఎం సర్ణలత, సీసీ పయణి, అకౌంటెంట్ సందిని, వీఏఓలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏరియా కో-ఆర్డినేటర్

పొగాకు ఉత్పత్తులను నిషేధిద్దాం



పిచ్చాటూరులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది



శ్రీకాళహస్తిలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న స్కౌట్ విద్యార్థులు



పాపానాయుడుపేటలో...,



తొట్టంబేడులో..



పిచ్చాటూరు: పొగాకు ఉత్పత్తులు మనిషి జీవితాన్ని నాశనం చేస్తాయని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గాయత్రి అన్నారు. బుధవారం స్థానిక పీ హెచ్‌సీ వైద్యులు, ఉద్యోగులు, సిబ్బంది ఆర్‌టీసీ బస్టాండ్ వరకు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడారు. పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల కాలేయం, గుండె పనితీరుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, తద్వారా ప్రాణాలకే ముప్పు కలుగుతుందన్నారు. ప్రజలు పొగాకు ఉత్పత్తుల వాడకానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ రెండవ వైద్యాధికారి హమీద్, ఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్‌లు, 108, 104 సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం హానికరం

శ్రీకాళహస్తి: పొగాకు ఉత్పత్తుల వాడకం ప్రాణాలకు హానికరమని స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు అన్నారు. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీకాళహస్తిలోని పెండ్లిమండపం, భిక్షాల గాలిగోపురం, ఆర్టీసీ కూడలి వద్ద భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ప్లకార్డులతో అవగాహన కల్పించారు. వీరికి సీఐ అంజూయాదవ్ ప్లకార్డు చేతబట్టి సంఘీభావం ప్రకటించారు. ఆమెతోపాటు స్కౌట్స్ మాస్టర్ అజారుద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్లు ధనుష్, గోపి, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

పాపానాయుడుపేటలో..

ఏర్పేడు: పాపానాయుడుపేటలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. గ్రామస్తులకు అవగాహన కల్పించారు. యువత పొగాకు ఉత్పత్తుల వాడకానికి దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. డాక్టర్లు అభిజ్ఞ, సాయిహారిణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తొట్టంబేడులో...

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): పొగాకు ఉత్పత్తులను వాడరాదని కోరుతూ తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు లహరి, సాయిపూజ, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.కార్యక్రమంలో పీహెచ్ఎన్ సంపూర్ణ, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, భారతి, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పట్టణంలోని గజేంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ జావిద్ ఆధ్వర్యంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ప్రజలు, యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.